సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 29 । జనవరి । 2025




రూ.లక్ష విరాళం
రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి చక్రావధానుల సూర్యలక్ష్మి (రాజమహేంద్రవరం) మంగళవారం రూ.లక్ష విరాళం అందజేశారు.



తాంబూలం.. తెగుళ్ల యుద్ధం
తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో తమలపాకు తోటలు మాడిపోతున్నాయి. వాతావరణంలో అధిక తేమ ఉండటంతో తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంది.

8లో

డెల్టాలకు 9,355 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 9,355 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 1,755, పశ్చిమ డెల్టాకు 4,700 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8 అడుగులకు తగ్గింది.

న్యూస్‌రీల్

సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం
కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాణీ లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్ కింద ఏపీ సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆరు నుంచి 9వ తరగతి వరకూ చదువుతున్న బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వచ్చే నెల 1 నుంచి 15వ తేదీ వరకూ 20 సెషన్స్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సమగ్ర శిక్షా డీసీడీవోడీ ఎస్తేర్ రాణిని 97047 83836 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం
రాజమహేంద్రవరం సిటీ: సేవా భూషణ్, విద్యా భూషణ్ జాతీయ స్థాయి పురస్కారాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హైదరాబాద్ సర్వేజనా సుఖినోభవంతు (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, సేవా సంస్థ)అధ్యక్షుడు ఈఎస్ఎస్ఎస్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. తమ సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భంగా పలు రంగాల్లో నిష్ణాతులైన వారిని ప్రోత్సహిస్తామన్నారు. ఫిబ్రవరి 9న హైదరాబాద్‌లో పురస్కారాల ప్రదానం జరుగుతుందని, వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పిల్లల్ని కనడం ఒక ఎత్తు.. వారిని పెంచడం వంద ఎత్తులు
సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



సుద్దాల అశోక్‌తేజ

రాజానగరం: పిల్లల్ని కనడం ఒక ఎత్తయితే వారిని పెంచడం వంద ఎత్తులని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. మంగళవారం దివాన్ చెరువు వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తమ కాలంలో ఉన్న అదృష్టం ఇప్పటి తరాలకు లేదన్నారు. తాను పదో తరగతిలోకి వచ్చే వరకూ రేడియో జోలికే వెళ్లలేదని.. నేడు ఆరు నెలల పిల్లాడి చేతిలో సెల్‌ఫోన్ పెట్టి తల్లి సీరియల్ చూసే రోజులు వచ్చాయని అన్నారు. 'ఒక్కసారి తల వంచి నా వైపు చూడు.. ఇక జీవితంలో తలెత్తకుండా చేస్తాను' అని సెల్‌ఫోన్ అంటే.. 'కొన్ని పేజీలు చదువు.. ఎర్రకోట మీద ఎగిరే జాతీయ జెండాలా నీవెప్పుడూ తలెత్తుకుని జీవించేలా చేస్తాను' అని పుస్తకం అంటుందని చెప్పారు. సెల్‌ఫోన్ చూడటం తప్పని చెప్పడం లేదని, ఎంతవరకూ వాడాలో అంతవరకే గానీ, వ్యసనంగా చేసుకోరాదని సూచించారు. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్న అమ్మాయిల విషయంలో ఇది ఎంతో జాగరూకతతో వ్యవహరించవలసినదనే విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. సినిమాల్లోకి రాక ముందే సామాజిక అంశాలతో సుమారు రెండు వేల పాటలు రాశానని, చిత్ర పరిశ్రమలోకి వచ్చాక గడచిన 30 సంవత్సరాల్లో రెండు వేల సినిమాల్లో మూడు వేల పాటలు రాశానని అశోక్‌తేజ చెప్పారు.

బ్రాహ్మణ పురోహిత క్రికెట్ విజేత కాకినాడ రుద్రాస్
అమలాపురం రూరల్: కోనసీమలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ పురోహిత క్రికెట్ టోర్నమెంట్‌లో కాకినాడ రుద్రాస్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా కొవ్వూరు గాయత్రి ఎలెవెన్స్ విజయం సాధించింది. కిమ్స్ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆర్గనైజింగ్ కమిటీ కర్ర బాబి, ఉపద్రష్ట విజయ్, గండికోట సాయి ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ పది రోజుల పాటు కొనసాగింది. మంగళవారం జరిగిన ఫైనల్‌లో కొవ్వూరు గాయత్రి ఎలెవెన్స్‌పై కాకినాడ రుద్రాస్ విజయం సాధించింది. రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు కె.బుచ్చిరాంప్రసాద్, రాష్ట్ర పురోహిత గౌరవాధ్యక్షుడు పాదిలి నారాయణమూర్తి, అధ్యక్షుడు రాణి శ్రీనివాస్, రాష్ట్ర పురోహిత సమాఖ్య ప్రధాన కార్యదర్శి సుదర్శన్ దుర్గాబాబు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఏవీ రమణ, ఎం.నరసింహమూర్తి తదితరులు విజేతలకు బహుమతులు అందించారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.34.67 లక్షలు
అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం 67 రోజులకు హుండీల ద్వారా స్వామివారికి రూ.34,67,500 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. అలాగే 409 గ్రాముల వెండి, 12 విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షణికావేశం.. తీరని శోకం





సృష్టిలో వెలకట్టలేనిది, అత్యంత విలువైంది ప్రాణం. నిత్య జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలకు, సవాళ్లకు పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉన్నా కొందరు చిన్న చిన్న విషయాలకే మనోస్థైర్యాన్ని కోల్పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. సమస్య ఏదైనా పరిష్కారం వైపు ఓర్పుగా అడుగులు వేయాలే తప్ప.. భయపడి బలవన్మరణానికి పాల్పడితే.. తమను నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గమనంలో ఉంచుకోవాలి. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకుంటే.. ఎంతటి కష్టం ఎదురైనా అలవోకగా జయించవచ్చు.

- పెరుగుతున్న ఆత్మహత్యలు
- అర్ధాంతరంగా ముగుస్తున్న జీవితాలు
- జిల్లాలో ఈ నెలలో 10 మంది బలవన్మరణాలు
- మానసిక దృఢత్వం అవసరమంటున్న నిపుణులు

రాజమహేంద్రవరం రూరల్: కుటుంబ కలహాలు.. ఆర్థిక సమస్యలు.. ఇంట్లో వాళ్లు మందలించారని.. భార్య కాపురానికి రాలేదని.. పరీక్షల్లో తప్పామని.. ఉన్నత విద్యలో బ్యాక్‌లాగ్స్ ఉండిపోయాయని.. ప్రేమ విఫలమైందని.. స్నేహితులు వంచించారని.. అనారోగ్య సమస్యలు.. వ్యసనాలకు బానిసలవడం .. ఇలా వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్న వారి సంఖ్య జిల్లాలో ఇటీవల పెరుగుతోంది. చిన్నచిన్న విషయాలకే విభేదాలు.. గొడవలు.. ఉద్వేగం.. కుంగుబాటుతో కొంతమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, పరిష్కారానికి కొంత సమయం ఎదురు చూసే ధైర్యం లేక అర్ధాంతరంగానే తనువు చాలిస్తూ.. కన్నవారిని, నమ్ముకున్న వారిని పుట్టెడు దుఃఖంలోకి నెడుతున్నారు. ఈ విధంగా ఈ నెలలో జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ పది మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. మరి కొంత మంది ఆత్మహత్యా యత్నానికి పాల్పడి, త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధిక శాతం మంది 40 ఏళ్ల వయస్సు లోపువారే ఉంటున్నారు. కానీ, 50 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో కూడా ఈ ధోరణి అధికంగా ఉంటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తీరిక లేని జీవితాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. పెద్దలు క్షణాల్లో సమస్యను పరిష్కరించి, మేమున్నామని భరోసా ఇచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి కుటుంబాల స్థానంలో చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. నేటి పరుగుల ప్రపంచంలో కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోలేనంతగా ఆలోచనా విధానాలు మారిపోతున్నాయి. ఫలితంగా చిన్నచిన్న సమస్యలకే చాలా మంది ఆత్మస్థైరాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో పంచుకోలేక వారిలో వారే కుంగిపోతూ ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్నారు.

అవగాహన లేక..

సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశమే చాలా సందర్భాల్లో బలవన్మరణాలకు దారి తీస్తోంది. జీవితం , సమస్యలపై సరైన అవగాహన లేకపోవడం కూడా కారణమే. ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న వారు సమస్యను తప్పించుకోవాలని చూస్తున్నారే తప్ప.. బతికి ఉన్నవారిని మరిన్ని సమస్యల్లోకి నెట్టేస్తున్నామన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి అధ్వానంగా మారుతుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్న బిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు. అలాగే, పెద్దలు బలవన్మరణాలకు పాల్పడితే.. వారిపై ఆధారపడిన భార్యాపిల్లలను ఓదార్చడం ఎవ్వరి తరమూ కాదు. అందువలన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పోరాడి పరిష్కరించుకోవాలే తప్ప తప్పించుకునేందుకు ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని మానసిక నిపుణులు చెబుతున్నారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పాడిశెట్టి దుర్గాంబిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న బొమ్మూరు ఎస్సై

ఈ లక్షణాలుంటే జాగ్రత్త పడాల్సిందే..
- ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు కొన్ని అసాధారణ లక్షణాలు కలిగి ఉంటారు.
- ఒంటరితనాన్ని కోరుకుంటారు.
- సకాలంలో ఆహారం తీసుకోరు.
- అతిగా నిద్ర పోతారు.
- రాత్రి వేళల్లో నిద్ర పోకుండా ఎక్కువగా ఆలోచిస్తూంటారు.
- కొన్నిసార్లు అసలు దేనికీ స్పందించరు.
- బతికి ఉండటం వ్యర్థమని.. చనిపోవాలనుకుంటున్నానని ముందుగానే పరోక్షంగా సంకేతాలిస్తూంటారు.
- ఇలాంటి వాటిని ప్రారంభంలోనే కుటుంబ సభ్యులు గుర్తించాలి. వారితో ప్రేమగా మాట్లాడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి తోడ్పాటునివ్వాలి. దీంతో పాటు మానసిక వైద్యుని వద్దకు తీసుకుని వెళ్తే ప్రయోజనం ఉంటుంది.

ఈ నెలలో బలవన్మరణాలివిగో..
- గోకవరం: భర్త వేధింపులు తాళలేక గండేపల్లి అనూష (24) ఆత్మహత్య.
- రాజమహేంద్రవరం: భార్య చనిపోయిందనే వేదనతో అన్నపూర్ణపేట రైల్వే గేటు సమీపాన రైలు కింద పడి కేకే రాజు అనే వ్యక్తి మృతి.
- హౌసింగ్ బోర్డు కాలనీ: భార్యతో విడిపోయి, విడాకులు కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో మనస్తాపంతో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కొల్లే రాజ్‌కుమార్ (38) ఉరి.
- పెరవలి మండలం ఖండవల్లి: భార్య కాపుకానికి రాలేదనే మనస్తాపంతో పురుగు మందు తాగి పల్లేటి రవి (24) ఆత్మహత్య.
- హౌసింగ్ బోర్డు కాలనీ: పాడిశెట్టి దుర్గాంబిక (30) కోపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య.
- ఉండ్రాజవరం మండలం పాలంగి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వీఆర్వో యార్లగడ్డ నాగ గంగరాజు (41) ఆత్మహత్య.
- నిడదవోలు రూరల్ మండలం సమిశ్రగూడెం: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆత్కూరి సాయి మణిదీప్ (21) బ్యాక్‌లాగ్స్ ఉన్నాయనే బెంగతో హాస్టల్ గదిలో పురుగు మందు తాగి ఆత్మహత్య. తల్లిదండ్రులకు పుత్రశోకం.
- రాజమహేంద్రవరం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక సాలా బాల పరమేశ్వరి (35) ఆత్మహత్య. ఇదివరకే భర్త చనిపోవడంతో దయనీయంగా మారిన ఇద్దరు పిల్లల పరిస్థితి.
- మద్యానికి బానిసై.. మానసిక పరిస్థితి సరిగా లేక మత్రి రాజా రంజిత్ కుమార్ (23) ఉరి వేసుకుని ఆత్మహత్య.
- హుకుంపేట డి-బ్లాకు: మద్యానికి బానిసై నేదునూరి సంతోష్ కుమార్ (25) ఆత్మహత్య. ఆధారం కోల్పోయిన భార్య, ఇద్దరు పిల్లలు.

ఇలా ఎదుర్కోవచ్చు



ఆత్మహత్యలు గతంలోనూ ఉండేవి. ఆత్మహత్య చేసుకున్నారంటే పరువు పోతుందని బయటకు తెలియనిచ్చేవారు కాదు. పోలీసులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించేవారు. ప్రస్తుతం మీడియా అవేర్‌నెస్ పెరిగిపోవడంతో విషయం బయటకు తెలుస్తోంది. పోలీసులు కేసులు నమోదు చేయడంతో ఎక్కువ ఆత్మహత్యలు జరుగుతున్నాయని అనుకుంటున్నాం. ఆత్మహత్య భావనను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. ఆత్మ విశ్వాసం, మంచి ఆలోచనలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. సానుకూల దృక్పథం, కౌన్సెలింగ్ ప్రక్రియ శక్తిమంతంగా పని చేస్తాయి. చాలా మంది జన్యుపరంగా, పరిస్థితుల ప్రభావం వలన ఆత్మహత్యలకు పాల్పడుతూంటారు. జన్యుపరంగా అయితే వారి జీన్స్‌లోనే ఆ భావన ఉంటుంది. పరిస్థితుల ప్రభావమైతే వివిధ కారణాలతో సంఘర్షణకు లోనై ఆత్మహత్యకు పాల్పడతారు. ఆత్మహత్య భావన ఉన్నవారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకూ ఇంట్లో వారందరి మధ్య మెలిగేలా చూసి ధైర్యం నింపాలి. జీవితంపై ప్రతికూల భావాలను వ్యక్తీకరించినప్పుడు కుటుంబ సభ్యులు తేలికగా తీసుకోకుండా వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, రాజమహేంద్రవరం

చంద్రబాబుకు దొంగ హామీలు పరిపాటే..

- 2019లో జగన్‌కు ఖాళీ ఖజానా ఇచ్చారు
- అయినా సంక్షేమ పథకాల అమలులో ఆయనదే అగ్రస్థానం
- చంద్రబాబు ఒక్క పథకమూ అమలు చేయలేదు
- ఆయనో ఫెయిల్యూర్ సీఎం
- అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో దొంగ హామీలు ఇవ్వడం, గద్దెనెక్కిన తరువాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ పనీ చేయలేనని చేతులెత్తేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు పరిపాటని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ విమర్శించారు. ఇటువంటి ఫెయిల్యూర్ సీఎం దేశంలోనే ఎక్కడా లేరని దుయ్యబట్టారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాకు వీడియో విడుదల చేశారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు అధికారంలోకి రావడానికి దొంగ హామీలివ్వడం పరిపాటిగా వస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణ మాఫీ చేయలేనని కచ్చితంగా చెప్తే.. తాను అమలు చేస్తానంటూ ప్రజలను నమ్మించి మోసం చేసిన ఘనుడు చంద్రబాబని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో ఆ ఒక్క కారణంతోనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత 2014–19 మధ్య దేశంలో పూర్తి స్థాయి ఫెయిల్యూర్ ముఖ్యమంత్రిగా నిలిచిపోయారన్నారు. ఆయన హయాంలో ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ రాలేదని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపలేకపోయారని ధ్వజమెత్తారు.

నాటి చంద్రబాబు ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి, 2019లో విజయం సాధించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్‌కు అప్పగించారని హర్షకుమార్ గుర్తు చేశారు. నాటి ఎన్నికల సమయంలో రూ.23 వేల కోట్ల నిధుల్ని పసుపు – కుంకుమ పేరిట మహిళలకు పంచి పెట్టేశారన్నారు. అటువంటి పరిస్థితుల్లో కూడా కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని మరీ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అమలు చేసి, అగ్రస్థానాన నిలిచారని కితాబు ఇచ్చారు. ప్రస్తుతం చంద్రబాబు చేయలేనంటున్న పథకాలను నాడు జగన్ అమలు చేసి చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి 8 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, సూపర్ సిక్స్ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. అమ్మకు వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఇస్తానన్న డబ్బులు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఉచిత బస్సు పథకాల జాడ లేదన్నారు. చేతకాని ముఖ్యమంత్రిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారని దుయ్యబట్టారు. ఇంత అసమర్థ ముఖ్యమంత్రిని ఇప్పటి వరకూ ఎక్కడా చూడలేదని ధ్వజమెత్తారు. ప్రజలను మోసగించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు.. సంక్షేమ పథకాలను నాటి సీఎం జగన్ ఏవిధంగా అమలు చేశారనే విషయాన్ని ఇప్పటికైనా ఆలోచించాలని హితవు పలికారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేని చంద్రబాబు.. కొత్త ప్రాజెక్టులు కట్టేందుకు అప్పుల కోసం సిద్ధం కావడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసే పద్ధతిని చంద్రబాబు ఇప్పటికైనా మార్చుకోవాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు.


జిల్లాకు మరో ఫైర్ స్టేషన్

హైవే లైన్‌గా సేవలు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో మరో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కానుంది. దీనికి ఇప్పటికే ఆమోద ముద్ర పడిందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మార్టిన్ లూథర్ కింగ్ మంగళవారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వెలుగుబంద ప్రాంతంలో ఈ ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అయితే, ఫైర్ ఇంజన్ రాకపోకలకు ఆ ప్రాంతం భౌగోళికంగా అనుకూలంగా లేకపోవడంతో ఆ ప్రతిపాదనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం గ్రామీణ ప్రాంతాలతో పాటు జాతీయ రహదారిలోని అన్ని ప్రాంతాల ప్రజలకూ అందుబాటులో ఉండేలా.. అలాగే హైవేపై ప్రమాదాలు జరిగితే సంఘటన స్థలానికి వేగంగా చేరుకునేలా దివాన్‌చెరువు లేదా రాజానగరం ప్రాంతాల్లో హైవే పక్కన కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నామని లూథర్ కింగ్ వివరించారు. ప్రస్తుతం వెలుగుబంద, చుట్టుపక్కల గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే రాజమహేంద్రవరం నగరం నుంచి ఫైర్ ఇంజిన్ వెళ్తోంది. ఈ క్రమంలో ట్రాఫిక్ రద్దీని తప్పించుకుని సంఘటన స్థలానికి చేరుకోవడంలో జాప్యం జరుగుతోంది. కొత్తగా ఏర్పాటు చేసే ఫైర్ స్టేషన్ వల్ల సంఘటన స్థలానికి వేగంగా చేరుకుని ఆస్తి, ప్రాణ నష్టాలు తగ్గించవచ్చని లూథర్‌కింగ్ చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం, కోరుకొండ, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు ప్రాంతాల్లో ఐదు ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. కొత్తగా హైవేలో ఏర్పాటు చేసే ఫైర్ స్టేషన్‌తో ఈ సంఖ్య ఆరుకు చేరుకోనుంది. స్థల సేకరణ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి, మార్చిలోగా కొత్త ఫైర్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకు రానున్నామని, ఈ స్టేషన్‌లో ఒక ఫైర్ ఇంజన్‌తో పాటు ఆరుగురు సిబ్బంది పని చేస్తారని లూథర్‌కింగ్ చెప్పారు.

పూల రైతుల పల్లెబాట



ఆటోలో వచ్చి అన్నవరప్పాడులో పూలు అమ్ముతున్న రైతు సురేష్

పెరవలి: శుభ ముహూర్తాలు, పండగలు ముగిసిపోవడం.. మరోవైపు దిగుబడి ఇబ్బడిముబ్బడిగా వస్తూండటంతో.. ధరలు పడిపోయి పూల రైతులు విలవిలలాడుతున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో కొంత మంది పూల రైతులు పల్లె బాట పడుతున్నారు. ఊరూరా తిరుగుతూ, పూలు అమ్ముకుంటూ.. ఎంతో కొంత ఆర్జించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొంత మంది సైకిళ్లు, మోటార్ సైకిళ్లపై ఈవిధంగా విక్రయిస్తూండగా.. మరి కొంత మంది ఆటోలో పూలు అమ్ముకుంటూ.. కొంతలో కొంత నష్టాన్ని భర్తీ చేసుకుంటున్నారు. 'పూలనే నమ్మి సాగు చేశాం. కానీ మార్కెట్లో ధరలు నానాటికీ పడిపోతూండటంతో అయినకాడికి పూలు అమ్మేసుకుంటున్నాం. కోత ఖర్చులైనా వస్తాయనే ఉద్దేశంతో గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటున్నాం' అని పూల సాగుకు, మార్కెట్‌కు ప్రసిద్ధి చెందిన కడియపులంక గ్రామానికి చెందిన పూలరైతు బి.సురేష్ అన్నారు. పెరవలి మండలం అన్నవరప్పాడులో మంగళవారం ఆటోలో వచ్చి ఆయన పూలు విక్రయించారు. కడియపులంక గ్రామానికి చెందిన సురేష్ కుటుంబమంతా పూల సాగు పైనే జీవిస్తున్నారు. కొన్ని రోజులుగా నేల చూపులు చూస్తున్న పూల ధరలు సోమవారం సాయంత్రానికి మరింతగా పడిపోయాయి. దీంతో పూల రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. 'ప్రస్తుతం కిలో చామంతి పూలకు రూ.20 నుంచి రూ.25 మాత్రమే వస్తోంది. నేను 300 కిలోల పూలు కోశాను. మార్కెట్లో అమ్ముకుంటే కోత ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో గ్రామాల్లో అమ్ముకుంటే ఖర్చులైనా వస్తాయనే ధీమాతో ఆటోలో పూలు కిలో రూ.40 చొప్పున అమ్ముకుంటున్నాను. ఇలా వచ్చిన రెండు గంటల్లోనే పూలన్నీ అమ్ముడైపోయాయి. దీని వలన కోత ఖర్చులు, ప్రయాణపు ఖర్చులు పోను మరో రూ.500 మిగిలాయి' అని సురేష్ చెప్పారు. ధరలు ఈవిధంగా పడిపోతే పూల రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

డీసీపీవో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం
రాజమహేంద్రవరం రూరల్: జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో రాజమహేంద్రవరంలోని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో ఖాళీగా ఉన్న డీసీపీవో పోస్టు–1కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.విజయకుమారి ఈ విషయాన్ని మంగళవారం ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఫిబ్రవరి ఆరో తేదీ వరకూ దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఆసక్తి కలవారు eastgodavari.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు (సీవీ) డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బొమ్మూరు మహిళా ప్రాంగణం ఆవరణలోని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారిత కార్యాలయంలో నమూనా పొందవచ్చన్నారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్) ప్రకారం పూర్తి చేసి, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాల జిరాక్సులు జతచేసి ఫిబ్రవరి ఆరోతేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

డ్రోన్లతో కషాయాల పిచికారీ



డ్రోన్‌లో కషాయాలను నింపుతున్న తీరును పరిశీలిస్తున్న రామకృష్ణ, అధికారులు

పెరవలి: ప్రకృతి సాగు విధానంలో పండిస్తున్న వరి పైరుపై డ్రోన్లతో కషాయాలు పిచికారీ చేస్తున్నామని సేంద్రియ వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ సాకా రామకృష్ణ తెలిపారు. మండలంలోని కాపవరంలో వరి చేలపై మంగళవారం డ్రోన్‌తో కషాయాల పిచికారీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి మండలంలోను 250 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే చేలపై 6 డ్రోన్లతో ప్రణాళిక ప్రకారం కషాయాలు పిచికారీ చేస్తున్నామని చెప్పారు. పెరవలి మండలంలో మొదటి విడతగా 650 ఎకరాల్లో పిచికారీ చేయాలని నిర్ణయించామని, ఇప్పటి వరకూ ముక్కామల, పెరవలి, ఉసులుమర్రు గ్రామాల్లో 106 ఎకరాల్లో డ్రోన్లతో పిచికారీ చేశామని తెలిపారు. దీని ద్వారా వరిపై తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. వరిపై వేప గింజల పొడి, ఇంగువ, చేప బెల్లం ద్రావణం పిచికారీ చేయటం వలన కాండం తొలుచు, రసం పీల్చే పురుగుల నివారణ జరుగుతుందన్నారు. బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, వావిల కషాయాలను జీవామృతంతో పిచికారీ చేయటం వలన ఎటువంటి తెగుళ్లనైనా నివారించవచ్చని వివరించారు. డివిజన్ మోడల్ మేకర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, ఈ కషాయాలు ప్రకృతి షాపుల్లో దొరకుతాయని చెప్పారు.

క్లుప్తంగా

సారా నియంత్రణకు జాయింట్ ఆపరేషన్

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్



రంగంపేట ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న నిశాంత్

రంగంపేట: సారా నిర్మూలనలో భాగంగా వివిధ శాఖల సమన్వయంతో జాయింట్ ఆపరేషన్ నిర్వహించనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, సారాపై రాష్ట్రవ్యాప్తంగా జనవరి 31 నుంచి నవోదయం 2.0 పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. అటవీ, రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ శాఖలన్నీ జాయింట్ ఆపరేషన్ ప్రారంభించనున్నట్టు తెలిపారు. వచ్చే ఏడాదికి సారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. రాజమహేంద్రవరంలోని మద్యం డిపోను తనిఖీ చేశామని, పాపులర్ బ్రాండ్లన్నీ అందుబాటులో ఉంచాలని సూచించామన్నారు. పాత స్టాక్ రిపోర్టులు, మద్యం షాపుల లైసెన్సుల్లో ఇబ్బందులను పరిశీలించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. నిత్యం వంద కేసుల వరకు నమోదు చేసి, రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తున్నట్టు వివరించారు. ఆయన వెంట ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళీ, అసిస్టెంట్ కమిషనర్లు రేణుక, శివప్రసాద్, సూపరింటెండెంట్ లావణ్య, ఎక్సైజ్ సీఐ సుధ, ఎస్సై దుర్గాప్రసాద్ ఉన్నారు.



బర్మా పురుగు సోకకుండా అవిసె మొక్కల తలలను విరుస్తున్న కూలీలు



మొదలుకుళ్లు తెగులు సోకిన తమలపాకు మొక్క



బాక్టీరియా ఆకుమచ్చ తెగులుతో మాడిన ఆకు



పొగాకు లద్దె పురుగు వల్ల చిల్లులు పడిన ఆకులు



అగ్గి పురుగు సోకడంతో ఆకుపై ఏర్పడిన మచ్చలు

తాంబూలం.. తెగుళ్ల యుద్ధం

కడుపు నిండా భుజించాక తాంబూలం వేసుకుంటే ఆ అనుభూతే వేరు. శుభకార్యాల్లోనూ తమలపాకు కిళ్లీలు ఉండాల్సిందే. పాత రోజుల్లో ఆకు, వక్క, సున్నం ఉంటే చాలు.. ఆ తాంబూలం వేసుకుని ప్రపంచాన్నే మైమరచేవారు. ఇప్పుడు రకరకాల పేర్లతో.. అనేక రుచులతో కిళ్లీలు మార్కెట్‌ను ముంచెత్తాయి. తమలపాకుల్లో బంగ్లా ఆకు ప్రసిద్ధి చెందినా.. స్థానిక అవసరాలకు జిల్లాలోని పెరవలి, కడియం మండలాల్లో పండే ఆకులనే వినియోగిస్తారు. ప్రస్తుతం తమలపాకు తోటలపై తెగుళ్లు దాడి చేస్తుండడంతో.. రైతులు బెంబేలెత్తుతున్నారు.

- తమలపాకు తోటలపై ఉధృతంగా దాడి
- బెంబేలెత్తుతున్న రైతులు
- జిల్లాలో 183 హెక్టార్లలో సాగు
- సస్యరక్షణ చర్యలు తీసుకోవాలంటున్న వ్యవసాయ నిపుణులు



సీహెచ్ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి కొవ్వూరు

పెరవలి: జిల్లాలో ఎక్కువగా పెరవలి, కడియం మండలాల్లో 183 హెక్టార్లలో తమలపాకు తోటలు సాగవుతున్నాయి. తమలపాకు తోటలపై తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండటంతో తోటలు మాడిపోతున్నాయి. వాతావరణం అధిక తేమ కలిగి ఉండటం వల్ల తెగుళ్ల వ్యాప్తి అధికంగా ఉంది. ప్రస్తుతం ఈ తోటలపై పొగాకు లద్దె పురుగు, అగ్గి పురుగు, నల్లి, బర్మా పురుగు, ఎండు తెగులు, బాక్టీరియా ఆకుమచ్చ తెగులు, కొలటోట్రికం వంటివి ఆశించాయని కొవ్వూరు ఉద్యానవన అధికారి సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వీటి నివారణకు రైతులు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను ఆయన వివరించారు.

పొగాకు లద్దె పురుగు

తమలపాకు తోటపై పొగాకులద్దె పురుగు ఆశిస్తే ఆకులను తీవ్రంగా నష్టపరుస్తాయి. ఆకులను ఆశించిన లద్దె పురుగు ఆకులను తిని రంధ్రాలు మిగులుస్తాయి. దీనివల్ల ఆకులు అందవిహీనంగా కనిపించడంతో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకుండా పోతుంది. దీని నివారణకు 5 మి.లీ. వేపనూనెను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి ఒక లీటరు వేపనూనె పిచికారీ తప్పనిసరిగా చేయాలి.

అగ్గి పురుగు

ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల వాటిపై కాలిన మచ్చలు ఏర్పడతాయి. ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఆకులు పుసుపుబారి కుళ్లిపోతాయి. దీని నివారణకు కార్బరిల్ 50 శాతం 2 గ్రా. పొడిని తీసుకుని, లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లనల్లి, ఎర్రనల్లి

ఆకుల అడుగు భాగాన చేరి రసం పీల్చడం వల్ల ఆకులు ముడత పడతాయి. దీనివల్ల పంటకు తీవ్ర నష్టం చేకూరుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 4 గ్రా. నీటిలో కరిగే గంధకపు పొడిని ఎకరానికి 800 గ్రా. వంతున కలిపి పిచికారీ చేయాలి.



ఉమ్మిడివారిపాలెంలో తెగుళ్లు సోకిన తమలపాకు తోట

పాడి-పంట

బర్మా పురుగు

ఈ పురుగులు అవిసె మొక్కల కాండం లోపల భాగాన్ని తొలిచి వేయడం వల్ల బలహీనపడి మొక్కలు విరిగిపోతాయి. దీనివల్ల తమలపాకు తీగలు పైకి పాకడానికి ఆస్కారం లేకపోవడంతో అవి దెబ్బతింటాయి.

ఈ పురుగు అవిసె మొక్కలను సోకిన వెంటనే.. ఆ మొక్కల తలలను విరిచేస్తే వీటి ప్రభావాన్ని తగ్గించవచ్చు.

ఎండు, మొదలు కుళ్లు

ఆకులపై గుండ్రటి గోధుమ రంగు మచ్చలు ఏర్పడి నల్లగా మారతాయి. తీగ మొదట్లో తెగులు ఆశించినప్పుడు వేరు గోధుమ రంగుకు మారి, తర్వాత నల్లగా అయి కుళ్లిపోతాయి. ఈ దశలో తీగపై ఆకులు పసుపు రంగుకు మారి, క్రమంగా ఆకులు, తీగలు ఎండిపోతాయి. దీని నివారణకు తెగులు లక్షణాలున్న ఆకులను, తీగలను ఎప్పటికప్పుడు తొలగించాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు నెలకొకసారి 0.5 శాతం బోర్డో మిశ్రమాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బాక్టీరియా ఆకుమచ్చ

ఆకుల అడుగు భాగాన గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడి, క్రమంగా పెద్దవై నలుపు రంగుకు మారి ఆకులు కుళ్లిపోతాయి. ఇవి మొక్కపైన, కాండం పైన, తీగలను ఆశించినప్పుడు అవి పగుళ్లు ఏర్పడటం, నలుపు మచ్చలు ఏర్పడటం వంటివి జరుగుతాయి. దీని నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కొలటోట్రికం ఆకుమచ్చ

తెగులు సోకిన ఆకుల పైభాగాన గుండ్రని గోధుమ రంగుతో కూడిన పసుపు రంగు మచ్చలు ఏర్పడి, క్రమేపీ నల్లబడి ఆకు అంతా వ్యాపిస్తాయి. ఈ తెగులు సోకిన ఆకులు పూర్తిగా నాణ్యతను కోల్పోతాయి. దీని నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం

తమలపాకుల తోట వేసే రైతులు దుక్కులో 40 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 40 కిలోల పొటాష్ వేసి రెండు సార్లు దుక్కు దున్నాలి. తీగ నాటిన రెండు నెలల నుంచి ఎకరానికి నత్రజని, వేపపిండి, యూరియా 1:1 నిష్పత్తిలో మూడు రకాలను 80 కిలోలు ఉండేలా ఎరువులను వేయాలి. ఇలా ఏడాదికి పరిస్థితులను బట్టి 4 నుంచి 6 దఫాలుగా ఎరువులను అందించాలి. ఎకరానికి టన్ను జిప్సం కూడా వేయాల్సి ఉంటుంది.

పారా వాలీబాల్ విజేత విజయనగరం



విజేతలు విజయనగరం, శ్రీకాకుళం జట్లతో సంఘ ప్రతినిధులు

తుని: అంగవైకల్యం ఉన్నా ఆటలో అద్భుతాలను సృష్టించారని పారా వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోడపాటి శివదత్ అన్నారు. మంగళవారం తుని రాజా కళాశాల మైదానంలో పారా వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 120 మంది దివ్యాంగులు పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో శ్రీకాకుళం, విజయనగరం జట్ల మధ్య ఫైనల్ హోరాహోరీగా సాగింది. విజయనగరం జిల్లా విజేత కాగా, శ్రీకాకుళం రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు స్పోర్ట్ అథారిటీ అధికారి శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగర దుర్గాప్రశాంతి బహుమతులందజేశారు. వివిధ జిల్లాలకు చెందిన 20 మందిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

సీతానగరం: రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కూనవరం–మిర్తిపాడు రోడ్డులో మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఉదయం ఆరు గంటల సమయంలో కూనవరానికి చెందిన పీతల వీరపండు, కొల్లి బొడ్డియ్య మోటార్ బైక్‌పై మిర్తిపాడు వైపు వెళుతున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరం పేపరు మిల్లులో డ్యూటీ దిగిన కోరుకొండ మండలం కోటి గ్రామానికి చెందిన అడప శ్రీనివాస్ తన బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. మిర్తిపాడు–కూనవరం రోడ్డులో ఉదయం మంచు విపరీతంగా ఉండటంతో, ఎదురుగా ఉన్న వాహనం కనిపించక, రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అడప శ్రీనివాస్ తలకు తీవ్ర గాయమై, అపస్మారక స్థితికి చేరుకోగా, అతని పరిస్థితి విషమంగా ఉంది. వీరపండు, బొడ్డియ్య తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి, బొడ్డియ్యను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కాలువలో స్కూలు వ్యాన్ బోల్తా



పెద్దాపురం మండలం వడ్లమూరు వద్ద కాలువలో బోల్తా పడిన వ్యాన్

- వడ్లమూరు వద్ద ఘటన
- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు



ఘటనా స్థలం వద్ద విచారణ చేస్తున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: ఏడుగురు విద్యార్థులతో ప్రయాణిస్తున్న స్కూలు వ్యాన్ కాలువలో బోల్తా పడిన సంఘటన మంగళవారం ఉదయం పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సామర్లకోట వివేకానందా స్కూల్ వ్యాన్ మంగళవారం ఉదయం దివిలి నుంచి వడ్లమూరు మీదుగా సామర్లకోటకు విద్యార్థులను తీసుకెళుతోంది. వాహనం వడ్లమూరు జగనన్న కాలనీలో విద్యార్థులను తీసుకువస్తుండగా వడ్లమూరు వద్ద అదుపు తప్పి కాలువలోకి బోల్తా పడింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. వీరంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అక్కడున్న స్థానికులు వెంటనే స్పందించి, విద్యార్థులను కాపాడి, వారింటికి పంపే ఏర్పాట్లు చేశారు. అసలే ఇరుకు రహదారి. పైగా రెగ్యులర్‌గా ఆ రోడ్డుపై వాహనం నడిపే డ్రైవర్ అందుబాటులో లేడు. దీంతో స్కూల్ యాజమాన్యం తాత్కాలిక డ్రైవర్‌నిచ్చి వాహనంలో విద్యార్థులను తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. ఇరుకు రహదారిపై డ్రైవర్‌కు అవగాహన లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో వ్యాన్‌లో దివిలికి చెందిన రాపాక రాజా వెంకటసాయి ఫణీంద్ర(ఆరో తరగతి), రాపాక నిత్య (నాలుగు), వడ్లమూరుకు చెందిన కొత్తపల్లి జాన్‌అబ్బుజ్ (రెండు), బిక్కిన నిత్యసాయి శ్రీనిధి(ఆరు), బిక్కిన నందు (మూడు), ఎ.అవినాష్ (ఆరు), ఎ.శ్రీరమ్య(మూడో తరగతి) ఉన్నారు. సమాచారం అందుకున్న పెద్దాపురం ఎస్సై మౌనిక సంఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి కారణాలపై ఆరా తీశారు. డ్రైవర్ నిర్లక్ష్యం, రహదారిపై అవగాహన లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్టు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

- 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య



కేసు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ విద్య, చిత్రంలో నిందితులు (ముసుగు ఉన్నవారు)

రాజమహేంద్రవరం రూరల్: కత్తితో బెదిరించి, దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరిచ్చిన సమాచారంతో ఎనిమిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఈస్ట్ జోన్ డీఎస్పీ బి.విద్య వెల్లడించారు. ఈ నెల 25న రాత్రి లాలాచెరువు చౌడేశ్వర్‌నగర్‌కు చెందిన మంచిలి నరేష్ రాజానగరం వెళ్లి, తిరిగి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా ఇంటికి వెళుతున్నాడు. మార్గం మధ్యలో రాత్రి 11.30 సమయంలో ముగ్గురు వ్యక్తులు అతడి స్కూటర్‌ను అడ్డుకుని, కత్తితో బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ.4 వేలు, వాహనాన్ని లాక్కెళ్లిపోయారు. ఈ మేరకు నరేష్ బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా బొమ్మూరు పీఎస్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్‌కు అందిన సమాచారంతో, ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది మంగళవారం ఉదయం హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద పాత నేరస్థుడైన అదే ప్రాంతానికి చెందిన తోట శివ, యానాంకు చెందిన షేక్ బషీర్, నారాయణపురానికి చెందిన కాపు అరుణ్ సాయికుమార్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ఉన్న స్కూటర్‌తో పాటు, వారి నుంచి మరో ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, తోట శివపై నాలుగు, షేక్ బషీర్‌పై రెండు, కాపు అరుణ్‌కుమార్‌పై ఆరు కేసులున్నట్టు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.8.10 లక్షలు ఉంటుంది. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సైలు సీహెచ్‌వీ రమేష్, ఆర్.అంకారావు, ప్రియాకుమార్, క్రైం పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర।। 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6200]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2593]

Wanted

■ రాజమండ్రి ILTD Junction, రైతు బజార్ ఎదురుగా ఉన్న ప్రముఖ మిల్క్‌డైరీ షాపునందు పనిచేయుటకు సేల్స్‌మెన్ కావలెను. Age : 40 years above. Cont: ✆ : 92465 50443 [R-949]

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్లను ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ప్రముఖ హోమ్‌కేర్ సంస్థకు కావలెను. మంచి జీతం+వ+ భో ✆ 91608 35559, 78158 35561 [B-431]

■ రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. Cont ✆ : 96525 29724, 93468 62560 [R-208]

■ ఇంటిపని, బేబీకేర్, పేషెంట్ కేర్, (M/F) జీ: 15k-25k, 24గం, ప్రతి నెలా 2 సెలవులు, భో.వసతి, లోన్, బోనస్ ఫ్రీ ఫోన్: 9160002192/ 9160002193 [SCA25001364]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషేంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతిఫుడ్ జీ:20k ఫోన్: 8977639662, 8977639663 [SCA25001369]

■ కష్టతెలీని కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 9666253675 [HA-99689]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆటోను ఢీకొన్న కాలేజీ బస్సు

ముగ్గురికి గాయాలు

అమలాపురం టౌన్: పట్టణంలోని 216 జాతీయ రహదారిపై స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం ఆటోను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. కాలేజీ బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థినులు, ఆటోలో ఉన్న ఓ మహిళ గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కళాశాల ముగిసిన తర్వాత విద్యార్థులతో వస్తున్న కాలేజీ బస్సు, అమలాపురం వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఢీకొంది. దీనిపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

హత్య కోణంలో పోలీసుల దర్యాప్తు




కుమారస్వామి (ఫైల్)



రాజోలు ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

రాజోలు: తాగునీటి చెరువులో మృతదేహమై కనిపించిన తాటిపాక గ్రామానికి చెందిన యువకుడు గుమ్మడి కుమారస్వామి(35) హత్యకు గురైనట్టు బంధువులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రాజోలు ప్రభుత్వాస్పత్రి వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఈ నెల 25న అదృశ్యమైన కుమారస్వామి.. 27న తాటిపాక తాగునీటి చెరువులో మృతదేహంగా ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం జరిగింది. మృతదేహంపై గాయాలుండడంతో, తన మేనల్లుడిని హతమార్చి, చెరువులో పడేశారని మేనమామ శ్రీనివాసరావు చెప్పారు. మాంసం వ్యాపారులైన తాటిపాక గ్రామానికి చెందిన మొగ్గా సత్తిబాబు, రాజు, జయరాజ్ ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆరోపించారు. మిగిలిపోయిన మాంసాన్ని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే, దానిని దొంగిలిస్తున్నాడనే అనుమానంతో కుమారస్వామిపై ఈ ఘాతుకానికి పాల్పడినట్టు చర్చించుకుంటున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నట్టు తెలిసింది. మృతుడి మేనమామ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేష్‌కుమార్ తెలిపారు.


వైనతేయలో దూకిన యువకుడు



కృపాకిరణ్(ఫైల్)

అల్లవరం: పాశర్లపూడి–బోడసకుర్రు బ్రిడ్జి పైనుంచి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఓ యువకుడు వైనతేయ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బ్రిడ్జి మధ్య భాగాన తన మోటార్ బైక్‌ను పార్క్ చేసి, అనంతరం వంతెన పైనుంచి నదిలోకి దూకేశాడు. బ్రిడ్జిపై ఉంచిన మోటార్ బైక్ నంబర్ ఆధారంగా అతడిని మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన జవ్వాది కృపాకిరణ్(25)గా గుర్తించారు. అతడి తండ్రి రెండేళ్ల క్రితం చనిపోగా, ప్రస్తుతం తల్లి, సోదరి ఉన్నారు. చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కృపాకిరణ్ ఇటీవల ఇంటికి వచ్చాడు. బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి యువకుడు నదిలోకి దూకాడన్న సమాచారంతో అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, గాలింపు చర్యలు చేపట్టారు. అతడు నదిలో దూకడానికి ప్రేమ విఫలం కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	16,000 – 16,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

రెండుకు చేరిన మృతుల సంఖ్య

ముమ్మిడివరం: రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య రెండుకు చేరింది. స్థానిక బైపాస్ రహదారిలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడగా, ఒకరు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మరో యువకుడు మంగళవారం రాత్రి చనిపోయాడు. ఎస్సై డి.జ్వాలా సాగర్ వివరాల మేరకు, అయినవిల్లి మండలం ఎరకలంకకు చెందిన వడ్డీ సిరాజ్(18), అనాతవరానికి చెందిన తాడి పల్లంరాజు మోటార్ బైక్‌పై శనివారం రాత్రి ముమ్మిడివరం వైపు వస్తున్నారు. అదే సమయంలో కాకినాడ నుంచి మలికిపురానికి నల్లి వంశీ, గెద్దాడ మణికంఠ మరో మోటార్ బైక్‌పై వెళుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా వీరి బైక్‌లు ఢీకొనడంతో, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, సిరాజ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురానికి చెందిన మరో యువకుడు గెద్దాడ మణికంఠ(20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆస్తి గొడవల్లో వ్యక్తిపై హత్యాయత్నం

రంగంపేట: వరుసకు సోదరుడైన వ్యక్తిపై ఆస్తి తగాదాల నేపథ్యంలో హత్యాయత్నానికి పాల్పడిన ఉదంతమిది. ఎస్సై కృష్ణసాయి వివరాల మేరకు, మండలంలోని కొత్త వీరంపాలెంకి చెందిన అన్నదమ్ముల పిల్లలైన మత్సా సతీష్, మత్సా శ్రీనివాస్ వరుసకు అన్నాతమ్ముళ్లు. కొంతకాలంగా వీరి మధ్య ఆస్తి తగాదాలున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో సతీష్ ఇంటి వద్ద మోటార్ పని జరుగుతోంది. అక్కడ సతీష్ తన భార్య వీరలక్ష్మితో కలసి ఉన్నాడు. అదే సమయంలో శ్రీనివాస్ కత్తితో దాడి చేయగా, సతీష్ చేతి బొటన వేలుకు, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన సతీష్‌ను అతడి భార్య వీరలక్ష్మి బంధువుల సాయంతో అనపర్తిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా సతీష్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై కృష్ణసాయి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఐదు మూగజీవాల మృత్యువాత



సూరయ్యపేటలో చనిపోయిన ఆవులు, ఎద్దు, గేదె



న్యాయం చేయాలని కోరుతున్న బాధిత కుటుంబ సభ్యులు

సూరయ్యపేటలో తీగలు తెగిపడడంతో ఘటన

తాళ్లపూడి: విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై ఐదు మూగజీవాలు మృతి చెందిన హృదయవిదారక సంఘటన సూరయ్యపేటలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ సూరయ్యపేటలో తాడిపూడి కాలువ సమీపంలో 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో మూడు ఆవులు, గేదె, ఎద్దు చనిపోయాయి. గ్రామానికి చెందిన అడ్డా చిన్నరాములు వీటిపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పశువులు మేతకు వెళ్లిన సమయంలో ఈ వైర్లు తెగి పడిఉన్న విషయాన్ని గమనించలేదు, వరుసగా నడుస్తున్న పశువులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. సంఘటన స్థలానికి తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ చేరుకుని, వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.